క్లుప్తంగా

కొలమాసనపల్లి విద్యార్థుల ప్రతిభ




చిత్ర, హేమంత్‌కుమార్

పలమనేరు: మండలంలోని కొలమాసనపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన చిత్ర శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీకి, ఇదే పాఠశాలకు చెందిన హేమంత్‌కుమార్ ఏపీఆర్‌జేసీ గ్యారంపల్లికి ఎంపికైనట్టు పాఠశాల హెచ్‌ఎం ధర్మేంద్ర శనివారం తెలిపారు. మంచి ప్రతిభ చూపి పాఠశాలకు మంచిపేరు తీసుకొచ్చిన వీరిని ఆయన అభినందించారు.

4న మెగా జాబ్‌మేళా

పలమనేరు: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జూలై 4న మెగా జాబ్‌మేళా జరుగుతుందని కళాశాల ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, డీఆర్‌డీఏల సౌజన్యంతో ఈ జాబ్‌మేళా జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. 20 ప్రైవేటు కంపెనీల ప్రతినిధులు ఇందులో పాల్గొంటారని ఆయన తెలిపారు. టెన్త్ నుంచి డిగ్రీ దాకా చదువుకున్న 18 నుంచి 35 ఏళ్లలోపు వారు ఇందులో పాల్గొనవచ్చునని పేర్కొన్నారు. జిల్లాలోని నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

మానిటరింగ్ కమిటీ సమావేశం రేపు

పుంగనూరు(చౌడేపల్లె): పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఈనెల 30న ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ రాము తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ 30న సోమవారం ఉదయం 11గంటలకు ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో సమావేశం నిర్వహిస్తామన్నారు. ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు, కమిటీ సభ్యులు హాజరుకావాలని ఆయన కోరారు.

ఉత్తమ ప్రతిభకు ప్రోత్సాహకాలు



విద్యార్థులను సన్మానిస్తున్న కోటేశ్వరరావు, ఎంఈఓ రెడ్డెన్నశెట్టి

పుంగనూరు(చౌడేపల్లె): విద్యారంగంలో ఉత్తమ ప్రతిభ చాటుతున్న విద్యార్థులకు ప్రోత్సాహకాలతోపాటు తగిన గుర్తింపు లభిస్తాయని ఎంఈఓ రెడ్డెన్నశెట్టి శనివారం అన్నారు. ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ చాటిన విద్యార్థులకు ప్రాఫిట్ షూ కంపెనీ చైర్మన్ కోటేశ్వరరావు ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పాటు చేసుకుని, వాటిని సాధించేందుకు కృషిచేయాలన్నారు. ఉత్తమ ప్రతిభ చాటిన విద్యార్థులకు బ్యాగ్, చెప్పులు, షీల్డ్, సర్టిఫికెట్ అందజేసి, ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రుద్రాణి, సీఆర్‌పీ నారాయణస్వామి, ప్రాఫిట్‌షూ కంపెనీ మేనేజర్ శివాజీ పాల్గొన్నారు.

లయన్స్ సేవలకు అవార్డు



అవార్డు పొందిన అమరావతి సురేష్

పుంగనూరు(చౌడేపల్లె): పట్టణంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పలు సేవా కార్యక్రమాలకుగాను అమరావతి సురేష్‌కు ఔట్ స్టాండింగ్ సర్వీస్ అవార్డు లభించింది. పుంగనూరులో లయన్స్ క్లబ్ ఆవిర్భావం నుంచి జిల్లా ప్రాజెక్టు మేనేజర్ డాక్టర్ పి.శివ ఆధ్వర్యంలో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇందులోభాగంగానే లయన్స్ క్లబ్, లియోక్లబ్ పుంగనూరు నోబుల్ అడ్వైజర్ అమరావతి సురేష్‌తోపాటు పలువురు సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని సేవలందించడంతో ఆయన సేవలను గుర్తించి లయన్స్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ఫ్యాబ్రిషియోఒలివేరా చేతులమీదుగా ఔట్‌స్టాండింగ్ సర్వీస్ అవార్డు అందుకున్నారు. అమరావతి సురేష్‌ను లయన్స్‌క్లబ్ ప్రతినిధులు, లియోక్లబ్ సభ్యులు అభినందించారు.

ఎవర్రా నన్నాపేది!

- శ్రీవర్ర చెన్నారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు పెరుగుతున్న ఆదరణ
- జిల్లాలోనే అడ్మిషన్లలో టాప్
- ఫలితాల్లోనూ మేటి, ప్లేస్‌మెంట్స్‌లోనూ ఘనాపాటి
- ఏటా వెయ్యికి దాటుతున్న విద్యార్థుల సంఖ్య
- ఇక్కడి ఆహ్లాదవాతావరణం, సౌకర్యాలే కారణం



ప్రభుత్వ డిగ్రీ కళాశాల



ట్యాబ్‌లు, ల్యాప్‌టాప్‌లతో బోధన

పలమనేరు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేస్తూ కార్పొరేట్ కళాశాల బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషిచేస్తుందనే విషయం ప్రజలకు బాగా తెలిసిన విషయమే. ఆమేరకు ఎన్నో ప్రైవేటు కళాశాలలు వెలుస్తున్నా పలమనేరులోని శ్రీవర్ర చెన్నారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాముఖ్యత మాత్రం ఏటా వెలుగుతూనే ఉంది. ఆమేరకు 1983లో ఇక్కడ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయగా ఇప్పటికీ విద్యార్థుల సంఖ్యలోగాని, ఏటా ఫలితాల్లోగానీ మేటిగానే ఉంటోంది. ముఖ్యంగా ఇక్కడి విద్యార్థులు ప్రైవేటు కళాశాలలకు దీటుగా పలు కంపెనీల ద్వారా ఉద్యోగాలు సాధిస్తున్నారు. దీంతో ఏటా ఎక్కువ మంది విద్యార్థులు ప్రభుత్వ కళాశాలలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు.

ఏటా అడ్మిషన్లలో టాప్...

చిత్తూరు జిల్లాలో కుప్పం, పలమనేరు, చిత్తూరు, పుంగనూరు, వెదురుకుప్పం, నగరిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలున్నాయి. అయితే ఏటా పలమనేరు కళాశాలలో మాత్రం అడ్మిషన్లు 900 నుంచి వెయ్యి దాటుతోంది. ఫలితాల్లో సైతం జిల్లాలోనే అగ్రగామిగా ఉంటోంది. ముఖ్యంగా ప్రాంగణ ఎంపికల్లో ఈ కళాశాల విద్యార్థులు ప్రైవేటు కళాశాలలకు దీటుగా పలు ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగాలను సాధించడం విశేషం.



అవసరమైన సైన్స్ ల్యాబ్‌లు



కళాశాలలో ఇండోర్ స్టేడియం

పలు ఉపాధి కోర్సులు అందుబాటులో...

ఇక్కడి కళాశాలలో బీకాం కంప్యూటర్స్, బీబీఏ, ఉపాధి అవకాశాలున్న డెయిరీ టెక్నాలజీ, హార్టికల్చర్, బీఏ తెలుగు, బీఏ ఉర్దూ, బీఎస్సీ మ్యాథ్స్, జువాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ యూజీ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. దీంతోపాటు పీజీలో ఎంకాం కోర్సు అందుబాటులో ఉంది.

సౌకర్యాలు ఘనం...

సాధారణంగా ప్రైవేటు డిగ్రీ కళాశాలలు సరైన సౌకర్యాలు లేక చిన్నపాటి గదుల్లో ఉండడం సాధారణంగా చూస్తుంటాం. కానీ ఇక్కడి ప్రభుత్వ డిగ్రీ కళాశాల 16 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. అన్ని డిగ్రీ కోర్సులకు అవసరమైన ల్యాబ్‌లు, ట్యాబ్‌లతో పాఠాలు, డిజిటల్ తరగతులు, నేషనల్ సెమినార్లు, పోటీ పరీక్షలకు అవసరమైన గ్రంథాలయం, క్రీడలకు ప్రత్యేక శిక్షణ, ఇండోర్ స్టేడియం, సైన్స్ ల్యాబ్‌లు, క్రీడామైదానం, ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్ సేవలు, అనుభవజ్ఞులైన అధ్యాపకులతో అవసరమైన సౌకర్యాలున్నందునే ఈ కళాశాల జిల్లాలోనే అగ్రస్థానంలో నిలుస్తోంది.

విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధే లక్ష్యం..



ఇక్కడి కళాశాలలో విద్యతోపాటు విద్యార్థులకు సర్వతోముఖాభివృద్ధే ధ్యేయంగా తాము కృషిచేస్తున్నాం. ఇంతటి సౌకర్యాలు, అద్భుతమైన ప్రాంగణం, విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలున్నందునే అటు విద్యార్థుల శాతంలోనూ ఏటా ఫలితాల్లోనూ, ఉద్యోగాల సాధనలోనూ జిల్లాలో మేటిగా ఉన్నాం. త్వరలో అడ్మిషన్లున్నాయి. గ్రామీణ ప్రాంత పేద విద్యార్థులు చేరేందుకు ఇక్కడి కళాశాల ఓ వరంలాంటింది.

డా.వెంకటేశులు బాబు, ప్రిన్సిపల్, డిగ్రీ కళాశాల, పలమనేరు

చాలీచాలని జీతాలతో ఎలా బతకాలి



ఆస్పత్రి వద్ద మాట్లాడుతున్న నేతలు

పుంగనూరు(చౌడేపల్లె): పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో శానిటేషన్ వర్కర్లు, అటెండర్లు చాలీచాలని జీతాలతో ఏవిధంగా బతకాలని ఏఐటీయూసీ, సీపీఐ నాయకులు వెంకటరమణారెడ్డి, రామమూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఆస్పత్రి పారిశుద్ధ్య కార్మికులతో సమావేశమయ్యారు. యాజమాన్యం ప్రతినెలా ఒకటో తేదీ వారికి జీతాలు చెల్లించాలని కోరారు. అంతే కాకుండా వారికి జీతాలను కాంట్రాక్టర్ల ద్వారా కాకుండా ప్రభుత్వమే నేరుగా చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ఆస్పత్రి సూపరింటెండెంట్ హరగోపాల్‌కు వినతిపత్రం ఇచ్చారు.

కారు ఢీకొని దంపతులకు గాయాలు

చౌడేపల్లె: బైక్‌ను కారు ఢీకొన్న ప్రమాదంలో దంపతులకు గాయాలయ్యాయి. ఈఘటన చౌడేపల్లె–పలమనేరు మార్గంలోని దుర్గసముద్రం సమీపంలో శనివారం జరిగింది. ఏ.కొత్తకోట పంచాయతీ ఎస్ అగ్రహారానికి చెందిన కృష్ణమూర్తి, సుమతి దంపతులు. వీర్దిరు బైక్‌లో ఇంటి నుంచి ఓదులపేటమీదుగా చౌడేపల్లెకు బయలుదేరారు. మార్గమధ్యంలోని దుర్గసముద్రం సమీపంలో వెళుతుండగా ఇదే మార్గంలో పలమనేరు నుంచి చౌడేపల్లెకు వెళ్తున్న కారు బైక్‌ను వెనుక నుంచి ఢీకొంది. ఈ ఘటనలో గాయపడిన దంపతులను పుంగనూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దాదేపల్లె ఉరుసులో పెద్దిరెడ్డి



దాదేపల్లె దర్గాలో మజ్జార్‌పై చాదర్‌ను సమర్పించి దువా చేస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



దాదేపల్లె వద్ద మహిళలతో మాట్లాడి ఉరుసు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

- చాదర్‌ను కప్పి దువా చేసిన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి
- ఘనస్వాగతం పలికిన మైనారిటీ నేతలు

చౌడేపల్లె: దాదేపల్లెలోని హజయత్ సయ్యద్ మషాయక్ బహదూర్ అలీషాబాబా ఉరుసు మహోత్సవంలో మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పాల్గొన్నారు. శనివారం దాదేపల్లెలో ఆయనకు పార్టీ శ్రేణులతోపాటు ముస్లింలు ఘన స్వాగతం పలికారు. రెండు రోజులపాటు కోలాహలంగా జరగబోయే ఉరుసులో బాబా దర్గా వద్దకు పూలు, చాదర్‌ను సమర్పించారు. మత పెద్దలు బాబా దర్గాలో ఎమ్మెల్యే డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీపీ మిథున్‌రెడ్డి, తంబళ్ల ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి కుటుంబ సభ్యులందరూ సుఖశాంతులతో ఉండాలని దువా నిర్వహించారు. అనంతరం అక్కడికి చేరుకున్న దాదేపల్లె గ్రామ ముస్లిం మహిళలతో ఆప్యాయంగా పలకరించి ఉరుసు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు దామోదరరాజు, పుంగనూరు మున్సిపల్ చైర్మన్ ఆలీంబాషా, వైస్ ఎంపీపీ సుధాకర్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు నాగభూషణరెడ్డి, ఉపాధ్యక్షుడు వెంకటరమణ, ఎస్‌ఎస్‌యూవి మాజీ జిల్లా అధ్యక్షుడు మిద్దింటి కిషోర్‌బాబు, మాజీ ఎంపీపీ రుక్మిణమ్మ, యూత్ వింగ్ సంయుక్త కార్యదర్శి కళ్యాణ్‌భరత్, మైనారిటీ నేతలు సుల్తాన్‌సాబ్, బషీర్‌సాబ్, సనావుల్లా, చిన్నరెడ్డిబాషా, షేర్‌ఖాన్, మహమ్మదాలి, బావాజాన్, ఆరీఫుల్లా, సాధిక్, షఫీతోపాటు సర్పంచులు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి

- మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల ఆందోళన
- వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ల మద్దతు



కార్మికులతో కలిసి నిరసనలో పాల్గొన్న మున్సిపల్ పాలకవర్గం

పలమనేరు: ప్రభుత్వ సంక్షేమ పథకాలు తమకూ వర్తింపజేయాలని, తమ సమస్యలను పరిష్కరించాలని పలమనేరు మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు డిమాండ్ చేశారు. ఆమేరకు స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద మూడో రోజు శనివారం వారు ఆందోళన చేశారు. నిరసనకారులు మాట్లాడుతూ మున్సిపాలిటీలో ఇంజినీరింగ్ విభాగంలో తాము రూ.13వేల జీతంతో పనిచేస్తున్నామన్నారు. తమలాంటి పేదలకు ప్రభుత్వ పథకాలను తొలగించడం చాలా బాధాకరమన్నారు. ఔట్‌సోర్సింగ్‌లో ఉన్న వాళ్లపై ఈ ప్రభుత్వం కొరడా ఝులిపించిందని విమర్శించారు. వీరికి మద్దతుగా స్థానిక మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ గుల్జార్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదరి ఎస్టీ మురళీకృష్ణ, రాష్ట్ర ఎస్టీ, ఎస్సీ సెల్ నేతలు నాగరాజ్, శ్యామ్‌సుందర్‌రాజ్, కౌన్సిలర్లు శాంతి, సల్మాశ్యామ్, హయాత్, కమాల్, హేమంత్, ఫయాజ్ పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలపై స్పందించాలి



మున్సిపల్ కార్మికులకు మద్దతు తెలుపుతున్న అయూబ్

పుంగనూరు(చౌడేపల్లె): కార్మికుల సమస్యలపై ప్రభుత్వం తక్షణం స్పందించి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అయూబ్ డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికులు చేపడుతున్న సమ్మె శనివారం 15వ రోజుకు చేరుకుంది. సమ్మె చేస్తున్న మున్సిపల్ కార్మికులకు మద్దతుగా కాంగ్రెస్ పార్టీకి చెందిన అయూబ్, ముబారక్ సంఘీభావం తెలియజేశారు. కార్మికులు శ్రీరాములు, విజయ్‌కుమార్, శైలజ, వెంకటరమణ, సుబ్రమణ్యం, చంద్రశేఖర్, జగన్నాథరెడ్డి, అంజప్ప, మురళి, సుదర్శన్‌రాజు, శ్రీనివాసులు, హరి, జయకుమార్, శ్రీకాంత్, నాగిరెడ్డి, దాము, సురేంద్ర, బోయకొండప్ప, వెంకటేష్ పాల్గొన్నారు.

కోలాహలం..దాదేపల్లె ఉరుసు



పుష్పాలంకరణలో మషాయక్‌బహద్దూర్ అలీషాబాబా మజ్జార్

చౌడేపల్లె: మండలంలోని దాదేపల్లెలో మషాయక్ బహద్దూర్ అలీషాబాబా ఉరుసు శనివారం కోలాహలంగా సాగింది. దర్గావద్ద నిర్వాహకులు ఏర్పాటుచేసిన విద్యుత్ దీపాలు, మక్కా మదీనా ఆకారంలో మిరుమిట్లు గొలిపే విద్యుత్ దీపాలు, పూలతో ముస్తాబుచేశారు. శనివారం రాత్రి పకీర్ల జోహార్ల నడుమ ఊరేగింపుగా తీసుకొచ్చిన గంధంను దర్గా వద్దకు తీసుకొచ్చి బాబాకు సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు, దువా నిర్వహించారు. కులమతాలకు అతీతంగా భక్తులు దర్గా వద్ద ప్రార్థనల్లో పాల్గొన్నారు. అధిక సంఖ్యలో ధర్గా వద్దకు భక్తులు చేరుకొని పూలచాదర్‌ను మజ్జాద్‌పై కప్పి బాబా ఆశీస్సులు పొందారు. ఉరుసును పురస్కరించుకొని ప్రజలకు అవసరమైన సదుపాయాలను మసీదు, ఉరుసు నిర్వాహక కమిటీ సభ్యులు ఏర్పాటుచేశారు. ఉరుసుకు హాజరైన ప్రజలకు అన్నదానం ఏర్పాటుచేశారు.

చెస్‌లో గూడూరుపల్లె విద్యార్థి ప్రతిభ



పుంగనూరులో అవార్డు అందుకుంటున్న సతీష్‌కుమార్

పుంగనూరు(చౌడేపల్లె): మండలంలోని గూడూరుపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థి సతీష్‌కుమార్‌కు ఫిడ్ ఆన్‌లైన్ ఆరీనాచెస్ టైటిల్ అవార్డుకు ఎంపికయ్యాడు. శనివారం ఈ మేరకు టీచర్ మణికంఠ మాట్లాడుతూ పాఠశాలలో తొమ్మిదవ తరగతి చదువుతున్న సతీష్‌కుమార్ గత మూడేళ్లుగా అంతర్జాతీయ చెస్ ఫెడరేషన్‌లో శిక్షణ పొందినట్లు తెలిపారు. ఈశిక్షణలో టైటిల్ గెలుచుకున్నారన్నారు. అవార్డు పొందిన విద్యార్థిని పాఠశాల యాజమాన్యం, లయన్స్‌క్లబ్ నోబుల్ సభ్యులు శాలువతో సన్మానించి అవార్డును ప్రదానం చేసి అభినందించారు.

విద్యా సామగ్రి పంపిణీ



విద్యా సామగ్రి పంపిణీ చేస్తున్న దాతలు

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని కావేటిగారిపల్లె మోడల్ ప్రైమరీ స్కూలు విద్యార్థులకు శనివారం పీలేరుకు చెందిన సాయి కంటి హాస్పిటల్ యాజమాన్యం ఉచితంగా నోట్‌బుక్స్, పెన్సిల్, పెన్లు, ప్యాడ్లు పంపిణీ చేశారు. డా.రమేష్‌బాబు, ఎంఈఓ సిద్ధరామయ్య, హెచ్‌ఎం శాంతి, స్కూల్ కమిటీ చైర్మన్ జయచంద్ర పాల్గొన్నారు.

గేటు పడి వాచ్‌మన్‌కు తీవ్రగాయాలు

రొంపిచెర్ల: వాచ్‌మన్‌పై ఇనుప గేటు పడి గాయాలైన సంఘటన శనివారం రొంపిచెర్లలోని ఓ ప్రయివేటు పాఠశాలలో చోటు చేసుకుంది. పాఠశాలలో వాచ్‌మన్‌గా పనిచేస్తున్న వెంకటరమణపై ఇనుప గేటు పడింది. ఈప్రమాదంలో అతనికి తీవ్రగాయాలయ్యాయి. అతన్ని పీలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పాఠశాల నిర్వాహకులు ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు.

ట్రిపుల్ ఐటీకి ఇద్దరు ఎంపిక




జాహ్నవి, భువనేశ్వరి

చౌడేపల్లె: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల నుంచి ఇద్దరు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు హెచ్‌ఎం నాగరాజరెడ్డి శనివారం తెలిపారు. గత విద్యా సంవత్సరంలో పదో తరగతి పాసైన టి.జాహ్నవి, భువనేశ్వరి ఎంపికయ్యారు. వీరిని పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

ఆటో ఢీకొని బాలుడికి తీవ్ర గాయాలు



గాయపడిన బాలుడు జిషాన్

పుంగనూరు(చౌడేపల్లె): ఆటో ఢీకొనడంతో ఓ బాలుడు తీవ్రంగా గాయపడిన ఘటన శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని నక్కబండలో నివాసం ఉంటున్న రుక్సానా కుమారుడు జిషాన్(7) శుక్రవారం రాత్రి ఇంటి ముందు ఆడుకుంటుడగా షేర్ ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో జిషాన్ తల భాగం ఆటోచక్రాల కింద పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన బాలుడ్ని పుంగనూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. బాలుడి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

అంతర్ జిల్లా ఫుట్‌బాల్ విజేత తిరుపతి

పలమనేరు: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్థానిక ఫుట్‌బాల్ క్లబ్ శనివారం నిర్వహించిన అంతర్ జిల్లా ఫుట్‌బాల్ టోర్నమెంటులో తిరుపతి జట్టు ఘన విజయం సాధించింది. చిత్తూరు జట్టుతో ఫైనల్స్‌లో తలపడిన తిరుపతి జట్టు గెలుపొంది. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా సీతారామయ్య, కిశోర్ కుమార్, స్థానిక ఫుట్‌బాల్ సంఘం అధ్యక్షుడు నవీన్, జిల్లా అధ్యక్షుడు కిశోర్ కుమార్, వైస్ ప్రిన్సిపల్ షణ్ముగం, కోచ్‌లు విక్రమ్, రాజ్‌కిరణ్, జాకీర్ పాల్గొన్నారు.



విజేత తిరుపతి జట్టు